మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 55 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# మెగా సంగ్రామానికి సర్వం సిద్ధం



- దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 96 స్థానాలకు ఎన్నిక
- ఎంపీ ఎన్నికలతో పాటే ఏపీలో అసెంబ్లీకి పోలింగ్
- భారీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

- మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిన ఎన్నికలు
- డబుల్ డిజిట్‌పై కన్నేసిన కాంగ్రెస్, బీజేపీ
- ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన ఈసీ

**- తెలంగాణలో 17 స్థానాలకు పోలింగ్**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. సత్తా చాటాలని బిజెపి చూస్తోంది. 400 సీట్ల టార్గెట్‌లో కనీసం ఏడెనిమిది సీట్లు సాధించాలన్న పట్టుదలతో ప్రచారం నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఈ ఎన్నికల్లో విశేషం. అలాగే నడ్డా, అమిత్ షాతో పాటు ఇతర రాష్ట్రాల సిఎంలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణలో అనూహ్యంగా నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు మెజారిటీ స్థానాలు కైవశం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం నిలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. ఈ పార్లమెంట్ ఎన్నికలు ప్రధానంగా సిఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మకం కానున్నాయి. గతంలో ఉన్న మూడు సీట్లను మించి సీట్లు సాధిస్తేనే ఆయన నాయకత్వంపై గురికుదురుతుంది. అలాగే మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన రేంవత్ రెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు మల్కాజిగిరి, భువనగిరి, నల్లగొండల్లో గెలుపు ముఖ్యం. అలాగే పాలమూరులోని రెండు సీట్లు కూడా సిఎం రేవంత్‌కు ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఐదు నెలల క్రితం అధికారం కోల్పోయిన కేసీఆర్ ఒకటి రెండు స్థానాలైనా గెలుచుకొని పార్టీని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి

మిగతా 2లో..

**నిర్భయంగా తమ ఓటేయండి**
- సోషల్ మీడియా అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు
- తెలంగాణ డీజీపీ రవిగుప్తా స్పష్టీకరణ

3లో..

# గాలివాన బీభత్సం

- పిడుగుపాటుతో ముగ్గురు మృతి
- నలుగురికి గాయాలు
- ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో కూలిన టెంట్లు
- ఆదిలాబాద్‌లో గాలివాన బీభత్సం
- తక్షణ చర్యలు చేపట్టండి
- కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్, (ప్రజా మంటలు):
రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదిలాబాద్ మెదక్ జిల్లాల్లో పిడుగు పాటుకు ముగ్గురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలో పిడుగు పడి తాత-మనవడు మృతి చెందడంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. పిడుగు పాటుతో గాయపడిన ఐదుగురికి వైద్య సాయం అందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పిడుగుపడి తాతా మనవళ్లు మృతి చెందిన విషాదకర సంఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని రామోజీపల్లిలో చోటుచేసుకుంది. వర్షం కురుస్తుండటంతో స్థానిక ఐకేపీ సెంటర్లో ఆరబోసిన ధాన్యం తడుస్తోందని చెప్పి పల్వంచ శ్రీరాములు (51), అతని మనుమడు విశాల్ (11) వడ్ల కుప్పల మీద టార్పాలిన్లు కప్పడానికి వెళ్లారు. ఆ సమయం లో ఉరుములు, మెరుపులు వచ్చి, పిడుగు పడే పరిస్థితి కనిపించింది. చెట్టు కిందకు వెళితే పిడుగు పడుతుందనే భయంతో వర్షం పడుతున్నా ఖాళీ సంచులు తలపై కప్పి వడ్ల కుప్ప దగ్గరే ఉన్నారు. అయితే వారికి సమీపంలోనే పిడుగు పడటంతో శ్రీరాములు, విశాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనూహ్యంగా పిడుగుపడి తాతా మనవళ్లిద్దరూ మృతి చెందడంతో రామోజీపల్లి లో విషాధ ఛాయలు అలుముకున్నాయి. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భారీ వర్షాల పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్,

మిగతా 2లో..

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జీహెచ్ఎంసీ**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
జీహెచ్ఎంసీ పరిధిలో భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. వర్షం కారణంగా తలెత్తిన ఇబ్బందులపై టోల్ ఫ్రీ నంబర్లు 040 2111 1111, 90001 13667కు సమాచారం అందించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# దేశవ్యాప్తంగా భాజపా వ్యతిరేక పవనాలు

- ప్రజలకు కేజ్రీవాల్ 10 గ్యారంటీలు - నా అరెస్టుతో ఆప్‌ను దెబ్బతీయాలని చూశారు
- మా ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేలను ఏమాత్రం కదిలించలేకపోయింది - పంజాబ్ ప్రభుత్వాన్నీ దెబ్బతీయాలన్న ప్రత్యర్థుల వ్యూహం కూడా పారలేదు - ఎన్నికల ప్రచారంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్
- నేను బయటుండేది 21 రోజులే.. జూన్ 2న మళ్లీ జైలుకెళ్లాలి - ఆ తర్వాత కూడా కలిసికట్టుగా పనిచేయాలి
- పార్టీ నేతలకు, ఎమ్మెలకు ఆప్ నేత పిలుపు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
బెయిల్‌పై బయటకొచ్చి ఎన్నికల ప్రచారం లో నిమగ్నమైన ఆప్ అధినేత, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం కీలక ప్రకటనలు చేశారు. భాజపా 'మోదీ కీ గ్యారంటీ' తరహాలోనే 'కేజ్రీవాల్ కీ గ్యారంటీ' పేరిట 10 హామీలను ప్రకటించారు. వీటిలో 24 గంటల ఉచిత విద్యుత్తు, వైద్యం వంటివి ఉన్నాయి. ఇప్పుడు ప్రజలు 'మోదీ కీ గ్యారంటీ', 'కేజ్రీవాల్‌కీ గ్యారంటీ'ల్లో ఏది కావాలో తేల్చుకోవాలని కోరారు. భాజపా ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని నెరవేర్చలేక పోయిందని విమర్శించారు. తన గ్యారంటీలకు మాత్రం మార్కెట్‌లో మంచి బ్రాండ్ ఉందని వ్యాఖ్యానించారు. తాను హామీ ఇస్తే అది కచ్చితంగా అమలవుతుం దన్న నమ్మకం ప్రజల్లో ఉందని తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే తమ హామీలను అమలు చేస్తామని కేజ్రీవాల్ తెలిపారు. అయితే, తన ప్రతిపాదనలను కూటమి

మిగతా 2లో..



# నేడే పోలింగ్

**నాల్గవదశ పోలింగ్‌లో 96పార్లమెంట్ స్థానాలకు**

**బిజేపి ప్రాబల్య స్థానాలలో కూటమి పోరాటం**


హైదరాబాద మే 12 (ప్రజా మంటలు ప్రత్యేక ప్రతినిధి) :
దేశంలోని 10 రాష్ట్రాల్లోని 96 నియోజకవర్గాలకు ఈ రోజు, నాలుగో దశ లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని అసెంబ్లీ, పార్లమెంట్, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాలకు ఒకే దశలో పోలింగ్ జరగనుంది. బీహార్ లో జెడియు ప్రభావం ఉన్న ప్రాంతంలో, ఉత్తర ప్రదేశ్ లో బిఎస్పీ కి బలం ఉన్న ప్రాంతంలో జరిగే ఈ ఎన్నికలు బిజేపి టో పాటు, ఇండియా కూటమికి కూడా ప్రధానమైనవే. ఉత్తర పరేష్ లో బిఎస్పీ పార్టీ బిజేపికి బి టీం గా వ్యవహరిస్తున్నా, ఈ నియోజక వర్గ ఓటర్లు తమ అభ్యర్థికి కాకుండా ఇతర పార్టీకి వోటు వేయడానికి అంతగా ఇష్టపడరని గత ఎన్నికల అనుభవాలు చెపుతున్నాయి. దీనితో బలహీనమైన బీఎస్పీ అభ్యర్థికి - ఇతర పార్టీలకు ఇక్కడ వోట్లు చీలిపోవడంతో బిజేపి లాభపడుతుందని అనుకొంటున్నారు.

మహారాష్ట్ర లోని మరట్వాడా ప్రాంతంలో జరుగుతున్న ఎన్నికలు అధికారంలో ఉన్న బిజేపి-శివసేన (ఏకనాథ్ షిండే) ప్రభుత్వానికి ఛాలెంజ్ లాంటిదే. ఇక్కడ జరిగిన మరాటాల రిజర్వేషన్ పోరాటం అధికారపార్టీకి నష్టం చేయవచ్చని అనుకొంటున్నారు. అలాగే పశ్చిమ బెంగాల్ లో కూడా బిజేపి -తృణమూల్ కాంగ్రెస్ లమధ్య గట్టిపోటీ ఉంది.

మే 13, 2024న పోలింగ్ జరిగే నియోజకవర్గాల పూర్తి వివరాలు :

1. ఆంధ్ర ప్రదేశ్: అరకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, నర్సాపురం, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, హిందూపురం, తిరుపూరు, , రాజామెట్, చిత్తూరు.
2. బీహార్: దర్భంగా, ఉజియార్‌పూర్, సమస్తిపూర్, బెగుసరాయ్, ముంగేర్
3. జమ్మూ కాశ్మీర్: శ్రీనగర్
4. జార?ండ్: సింగ్భూమ్, ఖుంటి, లోహర్దగా, పాలము
5. మధ్యప్రదేశ్: దేవాస్, ఉజ్జయిని, మందసౌర్, రత్లాం, ధర్, ఇండోర్, ఖర్గోన్, ఖాండ్వా
6. మహారాష్ట్ర: నందుర్బార్, జల్గావ్, రావెర్, జాల్నా, ఔరంగాబాద్, మావల్, పూణే, షిరూర్, అహ్మద్‌నగర్, షిర్డీ, బీడ్
7. ఒడిశా: నబరంగ్‌పూర్, బెర్హంపూర్, కోరాపుట్, కలహండి
8. తెలంగాణ: ఆదిలాబాద్, పెద్దపల్లె, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, భోంగీర్, వరంగల్, మహబుదాబాద్, ఖమ్మం
9. ఉత్తరప్రదేశ్: షాజహాన్‌పూర్, ఖేరీ, ధౌరాహ్రా, సీతాపూర్, హర్దోయి, మిస్రిఖ్, ఉన్నావ్, ఫరూఖాబాద్, ఇటావా, కన్నౌజ్, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్
10. పశ్చిమ బెంగాల్: బహరంపూర్, కృష్ణానగర్, రణఘాట్, బర్ధమాన్ పుర్బా, బుర్ద్వాన్-దుర్గాపూర్, అసన్సోల్, బోల్పూర్, బీర్భూమ్

## ప్రజా నాడి




# నేను అధికారంలో ఉన్నంత వరకు మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండవు

- స్పష్టం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- బెంగాల్‌కు ప్రధాని ఐదు గ్యారంటీలు
- తృణమూల్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాలు
- కాంగ్రెస్‌కు 'యువరాజు' ఆయన వయసు కంటే తక్కువ సీట్లు
- కోల్‌కతా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఎద్దేవా



కోల్‌కతా (ప్రజా మంటలు):
తాను అధికారంలో ఉన్నంత కాలం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆదివారం పశ్చిమ బెంగాల్‌లోని బరాక్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. "బెంగాల్‌కు 5 గ్యారంటీలు ఇస్తున్నాను. నేను అధికారంలో ఉన్నంత కాలం మత ప్రాతిపదికన రిజర్వేషన్ ఉండదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఎవరూ ఆపలేరు. అయోధ్యలో రామ మందిరంపై సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చలేరు. రామ నవమి పూజలను చేసుకోకుండా ఆపలేరు. సీఏఏ అమలును అడ్డుకోలేరు" అని ప్రధాని మోదీ బెంగాల్ ప్రజలకు హామీ ఇచ్చారు. శ్రీరాముడిని పూజిస్తే తృణమూల్ కాంగ్రెస్ ప్రజలను బెదిరిస్తోందని, రామనవమి వేడుకలకు అనుమతించట్లేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రామ మందిర నిర్మాణాన్నే వ్యతిరేకించిందని విమర్శించారు. దేశాన్ని అలాంట

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# మెగా సంగ్రామానికి సర్వం సిద్ధం



పోసుకున్నారు.

లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావం చూప నున్నందున మూడు ప్రధాన పార్టీలకూ ఎన్నికలు ప్రతి ష్ఠాత్మకంగా మారాయి. సోమవారం జరగనున్న పోలింగ్‌లో తెలంగాణ ప్రజలు ఎవరిని ఆదరించ బోతున్నారో, ఎవరిని తిరస్కరించబోతున్నారో తీర్పు ఇవ్వనున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ఐదు నెలలైనా వాస్తవంలోకి రాకుండా తెలంగాణను పాలించే సమర్థత తనకు మాత్రమే ఉందన్న భ్రమల్లో ఉన్న కేసీఆర్ 12 సీట్లు గెలిస్తే తానే ప్రధాని అంటూ బీరాలు పలికారు. బహిరంగ సభల్లో కూడా అదే విధంగా మాట్లాడారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రచారం చేయడం ఆయన అధికారం కోల్పోవడం తట్టుకోలేక పోయారని నిరూపిస్తోంది. తెలంగాణలో ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలకం కానున్నాయి. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్నాయి. ఆ క్రమంలో ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. రేపు నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. ఇంకా మూడు దశలు మే 20, మే 25, జూన్ 1వ తేదీన జరగనున్నాయి. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుందీ. అదే రోజు.. దేశంలోని ఓటరు ఏ పార్టీకి అధికారం కట్టబెడతాడనే విషయం స్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం అదే రోజు లెక్కించనున్నారు. దీంతో ఆ యా రాష్ట్రాల్లోని ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది సుస్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని మొత్తం 175 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు ఒడిశా అసెంబ్లీకి సైతం 4 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మే 13వ తేదీన ఆ రాష్ట్ర అసెంబ్లీకి తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 1వ తేదీన జరిగే నాలుగో దశ పోలింగ్‌తో.. ఒడిశా అసెంబ్లీకి పోలింగ్ ముగియనుంది. ఇక లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి మాధవిలత, అసదుద్దీన్ ఓవైసీ, కరీంనగర్ నుంచి బండి సంజయ్, బిహార్‌లోని బిగుసరాయి నుంచి గిరిరాజ్ సింగ్, కడప నుంచి వైయస్ షర్మిల, జార్ఖండ్‌లోని ఖుంతి నుంచి అర్జున్ ముండా, బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శత్రుఘ్నసిన్హా, బెహరంపూర్ నుంచి యూసఫ్ పఠాన్, అధిర్ రంజన్ చౌదరి, రాజంపేట నుంచి ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణలో బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ కిషన్ రెడ్డిలు మరోమారు పోటీ పడుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. ఆ తరవాత తెలంగాణ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. 160 కేంద్ర కంపెనీల బలగాలు రాష్ట్రంలో ఇప్పటికే మోహరించాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి 20 వేల పోలీస్ బలగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, వాటిని సీఈఓ ఆఫీస్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. లక్ష 90 వేల మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వచ్చే 48 గంటల పాటు వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని వివరించారు. 21 వేల 680 మంది ఓటర్లు హోం ఓటింగ్ వేసుకున్నారని వికాస్ రాజ్ తెలిపారు. 328 పోలింగ్ కేంద్రాలను ఏజెన్సీ ఏరియాల్లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూడు పోలింగ్ కేంద్రంలో అత్యల్ప ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్లు ఉండగా. ఇందులో సగానికి పైగా మహిళా ఓటర్లే ఉన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకుగాను 13 నియోజక వర్గాల్లో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఎండలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించింది ఎన్నికల సంఘం. 9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన ఎన్నికల సంఘం, అలాంటి ఏరియాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా పెట్టేలా ప్లాన్ చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎన్నికల సంఘం.. అలాంటి ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగాలని నిర్ణయించింది. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్నికల విధుల్లో భాగంగా కేంద్రం నుండి 175 కంపెనీలు విధుల్లో ఉండనున్నాయి. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా 14 మందిని నియమించారు. జనరల్ పరిశీలకులుగా 17 మందిని నియమించారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది సామాగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో భద్రత మధ్య చేరవేశారు.

## నేడు నాలుగో విడతకు సై

న్యూఢిల్లీ(జనంసాక్షి):
సోమవారం దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నాలుగో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం అయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం భద్రతా ఏర్పాట్లు చేసింది. నాలుగో విడతలో ఏపీ, తెలంగాణ సహా మొత్తం 10 రాష్ట్రాల్లో నేడు పోలింగ్ జరగనుంది. నాలుగో విడతలో 96 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. ఏపీ(25), తెలంగాణ (17), బిహార్(5), ఝార్ఖండ్(4), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), ఒడిశా(4), యూపీ(13), ప.బెంగాల్(8), జమ్ముకశ్మీర్(1) స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. లోక్‌సభతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఇదే విడతలో పోలింగ్ నిర్వహించడం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో కీలక నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ విడతలో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పోటీ చేస్తున్న కన్నౌజ్ నియోజకవర్గంలో పోలింగ్ జరుగుతోంది. బీజేపీకి కంచుకోటగా ఉన్న ఉత్తరప్రదేశ్ లో కన్నౌజ్‌తో పాటు షాజహాన్‌పూర్, ఖేరీ, ధౌరహర, సీతాపూర్, హర్దోయి, మిస్రిఖ్, ఉన్నావ్, ఫరూఖాబాద్, ఎటా, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్ నియోజవర్గాల్లో రేపు ఎన్నికలు నిర్వహించనున్నారు. 4వ విడతలో పోటీలో ఉన్న ప్రముఖుల్లో అఖిలేష్‌తో పాటు టీఎంసీ నేతలు మహువా మొయిత్ర వెస్ట్ బెంగాల్ కృష్ణనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్నారు. అలాగే తృణముల్ కాంగ్రెస్ నేత శత్రుఘ్న సిన్హా ఆసన్సోల్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ ముఖ్య నేతలు గిరిరాజ్ సింగ్ బీహార్‌లోని బేగుసరాయి నియోజకవర్గంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఝార్ఖండ్ నుంచి ఖుంటి నియోజకవర్గంలో అర్జున్ ముండా పోటీ చేస్తున్నారు. మూడో విడతలో అధికారంలో ఉన్న అమిత్ షా వంటి అగ్రనేతలు బరిలో నిలిస్తే ఇప్పుడు ప్రతిపక్షంలోని ముఖ్యనేతలు ఎన్నికల్లో పోటీ చేయడంతో ఆసక్తిగా మారింది.

# ఈసీ కొరడా

## - ఐదుగురు సిఐలు, ఓ ఎస్పీపై బదిలీ వేటు

అమరావతి (ప్రజా మంటలు):
నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డిపై చర్యలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల కోడ్ అమల్లో విఫలమైన ఎస్పీపై ఛార్జెస్ ఫైల్ చేయాలని ఈసీ ఆదేశించింది. ఎస్పీతో పాటు ఎస్‌డీపీవో రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ రాజారెడ్డిపైనా శాఖాపరమైన విచారణ జరపాలని డీజీపీకి ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యల వివరాలను ఆదివారం రాత్రి 7గంటల్లోపు తెలియజేయాలని ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. సినీనటుడు అల్లు అర్జున్ నంద్యాల పర్యటనకు సంబంధించి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఈసీ తెలిపింది. ఆయన్ను చూసేందుకు భారీగా అభిమానులు గుమికూడారని, 144 సెక్షన్ అమలులో ఉన్నా జనాలను నియంత్రించటంతో పోలీసులు విఫలమయ్యారని ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అల్లు అర్జున్‌పై ఇప్పటికే కేసు నమోదైందని తెలిపింది. నంద్యాలలో సినీ నటుడు అల్లు అర్జున్ పర్యటన వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఆయన పర్యటనకు రిటర్నింగ్ అధికారి ముందస్తు అనుమతులు ఇవ్వలేదు. నంద్యాల ఎమ్మెల్యే, వైకాపా అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటికి శనివారం ఉదయం అల్పాహారానికి అల్లుఅర్జున్ వచ్చారు. వైకాపా శ్రేణులు వ్యూహాత్మకంగా పట్టణ శివారు నుంచే భారీ వాహనాలు, మోటారు సైకిళ్లతో ప్రదర్శనగా పట్టణంలోకి ఆయనను తీసుకువచ్చాయి. ఆయన పర్యటనకు అధికారిక అనుమతులూ లేకపోయినా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉండగా ఇంచుమించు అదే సమయంలో హీరో అర్జున్ పర్యటన ఉండటంతో జిల్లా కేంద్రంలో కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై ఫిర్యాదులు అందడంతో ఎన్నికల సంఘం స్పందించింది.




ఐదుగురు సిఐలపై బదిలీ వేటు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానున్న వేళ మరికొందరు పోలీసు అధికారులపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. కోడ్ ఉల్లంఘించి, అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న పలువురు ఉన్నతాధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్న ఈసీ తాజాగా మరో ఐదుగురు సీఐలపై చర్యలు తీసుకుంది. తిరుపతికి చెందిన ఐదుగురు సీఐలను అనంతపురం జిల్లాకు బదిలీ చేసింది. వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ తెదేపా నేతలు ఫిర్యాదు చేయడంతో.. సీఐలు జగన్మోహన్‌రెడ్డి, అంజూయాదవ్, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, వినోద్‌కుమార్‌లను అనంతపురంలో ఎన్నికల విధులు నిర్వహించాలని ఈసీ ఆదేశించింది.

# ‘నోటా’ పెరిగితే చట్టాలపై పునరాలోచన!

## - మాజీ సీఈసీ ఓపీ రావత్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
‘నోటా కు ఓటేయాలంటూ మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్‌లో కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోన్న విషయం తెలిసిందే. తమ అభ్యర్థి చివరి క్షణంలో నామినేషన్ ఉపసంహరించుకుని, భాజపాలో చేరిపోవడంతో..హస్తం పార్టీ పోటీలో లేకుండా పోయింది. దీంతో పోటీలో ఉన్న వారెవరికీ మద్దతు ప్రకటించకుండా.. ‘నోటా’ మాటెత్తుకుంది. అయితే, ఎన్నికల ఫలితాలపై ‘నోటా’ ప్రభావం నామమాత్రమేనని మాజీ సీఈసీ ఓపీ రావత్ తెలిపారు. ఒకవేళ దీనికి 50 శాతానికిపైగా ఓట్లు వస్తే మాత్రం.. ఎన్నికల ఫలితాలపై దాని ప్రభావం పడేలా చర్యలు తీసుకోవడంపై ఆలోచించాల్సి ఉంటుందన్నారు.”ప్రస్తుత పరిస్థితుల్లో ‘నోటా’కు నామమాత్రపు ప్రాముఖ్యమే ఉంది. ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపదు. ఒక స్థానంలో 100 ఓట్లలో నోటాకు 99, అభ్యర్థికి ఒక ఓటు వచ్చినా.. అభ్యర్థే విజేతగా నిలుస్తారు. ఒకవేళ నోటాకు 50 శాతానికిపైగా ఓట్లు వస్తే.. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను తాము అర్హులుగా పరిగణించడం లేదని ఓటర్లు చాటుతున్నట్లే. దీంతో పార్లమెంటు, ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఎన్నికల ఫలితాలపై ఈ ఓట్లను ప్రభావితం చేయడానికి చట్టాలను మార్చడం గురించి వారు ఆలోచించాల్సి ఉంటుంది” అని ఓపీ రావత్ తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇండౌర్‌లో 5045 ఈ ఓట్లు నమోదయ్యాయి. భారత్‌లో 2013 వరకు అభ్యర్థులు నచ్చకున్నా, సరైనవారు పోటీలో లేరని భావించినా.. ఎవరికో ఒకరికి ఓటేయాల్సిన పరిస్థితి ఉండేది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి.. 2013లో ‘నోటా’ను ప్రవేశపెట్టారు. ఆ ఏడాది దిల్లీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా దీనిని అమలు చేశారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో దీనికి సగటున రెండు శాతం కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో బిహార్‌లోని గోపాల్‌గంజ్‌లో ఏకంగా 51,660 మంది దీనికి ఓటేశారు. పోలైన మొత్తం ఓట్లలో ఇవి ఐదు శాతంతో సమానం.

# మరో ఇద్దరు భారత విద్యార్థులు మృతి

## - అమెరికాలో ఆందోళన కలిగిస్తున్న మరణాలు

హైదరాబాద్ (ప్రజా మంటలు):



అమెరికాలో తెలుగు విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా, ఇద్దరు తెలుగు విద్యార్థులు జలపాతంలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అమెరికాలోని అరిజోనాలో ఫజిల్ క్రీక్ ఫాల్స్ వద్ద జరిగింది. ఈ నెల 8వ తేదీన 16 మంది స్నేహితుల బృందం స్నాతకోత్సవం సందర్భంగా జలపాతం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి, రోహిత్ మణికంఠ లేపాల అనే ఇద్దరు విద్యార్థులు జలపాతంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయారు. గమనించిన స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారి కోసం గాలింపు ప్రారంభించగా మొదటి రోజు వీరి ఆచూకీ లభించలేదు. రెండో రోజు వీరి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో తెలంగాణ విద్యార్థి లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి.. ఖమ్మం నగరంలోని విద్యా రంగ ప్రముఖులు లక్కిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఏకైక కుమారుడు. ఇతను కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఇక మరో విద్యార్థి రోహిత్ మణికంఠ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాగా, కుమారుడి స్నాతకోత్సవం వేడుకకు హాజరయ్యేందుకు ఇటీవలే రాకేశ్ తల్లిదండ్రులు అమెరికా వెళ్లారు. అయితే, అనుకోని ప్రమాదంలో అతను మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. గడిచిన తొమ్మిదేళ్లలో ఈ జలపాతం వద్ద 9 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. ఇక, ఏప్రిల్ లో ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు జారి పడి ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన స్కాట్లాండ్ లో జరిగింది.

# నిర్భయంగా తమ ఓటేయండి

## - సోషల్ మీడియా అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు

## - తెలంగాణ డీజీపీ రవిగుప్తా స్పష్టీకరణ



హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ రవి గుప్తా తెలిపారు. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినిగించుకోవాలి డీజీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర సరిహద్దుల్లో పారామెలిటీ బలగాలతో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ విభాగాలు సహా.. 164 సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరాలను వెల్లడించారు. అలాగే 7వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో బందోబస్తు నిర్వహి స్తున్నా మని, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.186కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, తనిఖీలకు సంబంధించి 8,863 కేసులు నమోదు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కేంద్ర బలాలతో భద్రత ఏర్పాటు చేసామని అన్నారు.

# సరిహద్దు సమస్యలపై సయోధ్య కుదరాలి



- వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలి
- అప్పుడే చైనాతో సాధారణ ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ మెరగవుతుంది
- స్పష్టం చేసిన విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్

దిల్లీ (ప్రజా మంటలు): చైనాతో సాధారణ ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ.. సరిహద్దుల్లో శాంతియుత వాతావరణంపైనే ఆధారపడి ఉందని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. సరిహద్దుల్లో గస్తీ హక్కులు సహా పలు అంశాలపై ఇంకా సయోధ్య కుదరాల్సిన అవసరం ఉందని తెలిపారు.భారత్-చైనా సరిహద్దు సమస్యల్ని వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు కేవలం భారత్, చైనాకే కాకుండా యావత్ ప్రపంచానికి చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఎప్పటి వరకు రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొంటాయన్న ప్రశ్నకు జైశంకర్ పై విధంగా స్పందించారు. సరిహద్దుల్లో అసాధారణ పరిస్థితులు ఉన్నప్పుడు చైనాతో ద్వైపాక్షిక వాణిజ్యం ఎందుకు పెరుగుతోందన్న ప్రశ్నకూ జైశంకర్ సమాధానమిచ్చారు. 2014కి ముందు తయారీ రంగానికి సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వివరణ ఇచ్చారు. 2020లో గల్వాన్‌లో సైనిక ఘర్షణ తర్వాత భారత్-చైనా మధ్య సంబంధాలు క్షీణించిన విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య పలు దఫాల్లో చర్చలు జరిగినప్పటికీ.. ఇంకా అనేక అంశాలపై సయోధ్య కుదరలేదు.

# నేను అధికారంలో ఉన్నంత వరకుమత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండవు

వారి చేతిలో పెడదామా అని మోదీ ప్రజలను ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం కాంగ్రెస్ కుటుంబం దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిందని.. పశ్చిమ బెంగాల్, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఉన్న సహజవనరులను దేశ అభివృద్ధికి ఉపయోగించుకోలేదని మోదీ దుయ్యబట్టారు. అలా అయితే.. ఈ రాష్ట్రాలు ఎప్పుడో ఆర్థిక అభివృద్ధిని సాధించేవన్నారు. కాంగ్రెస్‌కు ‘యువరాజు’ వయసు కంటే తక్కువ సీట్లు తృణమూల్ కాంగ్రెస్ ఓట్ బ్యాంక్ రాజకీయాలు చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. సందేశ్‌ఖాలీలో హింసకు గురైన మహిళలను ఆ పార్టీ గూండాలు బెదిరిస్తున్నారని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని ప్రసంగించారు. ఈ సారి కాంగ్రెస్‌కు యువరాజు (రాహుల్) వయసు కంటే తక్కువ సీట్లు వస్తాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ చరిత్రలో ఎన్నడూ చూడనన్ని తక్కువ స్థానాల్లో విజయం సాధించనుందని పేర్కొన్నారు. టీఎంసీ మరోసారి విజయం సాధించే అవకాశమే లేదని మోదీ అన్నారు. కాంగ్రెస్-లెఫ్ట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితిలో లేవని చెప్పారు. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఎన్‌డీఏతోనే సాధ్యమన్నారు. ఇక ఉత్తర 24 పరగణ జిల్లాలో జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ టీఎంసీ సర్కారు మన అక్కాచెల్లెళ్లకు ఏం చేసిందో ప్రజలంతా చూశారని విమర్శించారు. ఇప్పుడు సందేశ్‌ఖాలీ బాధితులను టీఎంసీ గూండాలు షాజహాన్ షేక్ పేరు చెప్పి బెదిరిస్తున్నారన్నారు. నిందితులను కాపాడటానికి ఆ పార్టీ అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆ పార్టీ పాలనలో బెంగాల్ పూర్తి అవినీతి రాష్ట్రంగా మారిపోయిందన్నారు. రాష్ట్రం నేరగాళ్లతో.. బాంబుల తయారీ కేంద్రమైందని మండిపడ్డారు.

# దేశవ్యాప్తంగా భాజపా వ్యతిరేక పవనాలు

భాగస్వామ్య పక్షాలతో చర్చించలేదని వెల్లడించారు. కానీ, వీటిని అమలు చేసేలా ఆప్ తరఫున ఒత్తిడి తెస్తామని తెలిపారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు ‘కనీస మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే దిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కూడా తమ హామీల్లో ఒకటని తెలిపారు. చైనా అధీనం నుంచి భారత భూభాగాన్ని విడిపించడం, అగ్నివీర్ పథకాన్ని తొలగించడం, జీఎస్‌టీ వ్యవస్థ సరళీకరణ వంటి అంశాలు కూడా తమ గ్యారంటీల్లో ఉన్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను సంస్కరిస్తామని కేజ్రీవాల్ అన్నారు. అందరికీ మెరుగైన విద్య అందజేస్తామని తెలిపారు. అందుకు రూ.5 లక్షల కోట్లు అవసరమని పేర్కొన్నారు. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే తరహాలో మెరుగైన వైద్యారోగ్యానికి సైతం రూ.5 లక్షల కోట్లు వెచ్చిస్తామని తెలిపారు. దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందుతుందని హామీ ఇచ్చారు. బీమా ఆధారంగా చికిత్స అందజేసే విధానం ఒక పెద్ద కుంభకోణమని ఆరోపించారు. మరోవైపు నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. దిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనకు సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం కావాలని.. సీఎం హోదాలో ఫైళ్లపై సంతకాలు చేయొద్దని షరతు విధించింది. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ఆయన ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈసారి కచ్చితంగా ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందులో ఆప్ భాగస్వామ్యపక్షంగా ఉంటుందని తెలిపారు.

**నేను బయటుండేది 21 రోజులే.. జూన్ 2న జైలుకెళ్లాలి: కేజ్రీవాల్**

తాను ఎన్నికలు ముగిసే వరకు 21 రోజులు మాత్రమే బయట ఉంటానని.. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆయన నేడు దిల్లీలో తన పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. తమ ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేలను కేంద్రం ఏమాత్రం కదిలించలేకపోయిందన్నారు. ఇక పంజాబ్ ప్రభుత్వాన్ని దెబ్బతీయాలన్న ప్రత్యర్థుల వ్యూహం కూడా పారలేదన్నారు. దేశం మొత్తం భాజపా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఆప్ ఎమ్మెల్యేల ఐక్యతను చూసి దేశం గర్వపడుతోందని పేర్కొన్నారు. జూన్ 2న తాను తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుందని.. ఆ సమయంలో పార్టీ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. తన అరెస్టు తర్వాత ఆప్ మరింత బలపడిందని తెలిపారు.”మొన్న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు అద్భుతం కంటే తక్కువ కాదు. మిమ్మల్ని మళ్లీ చూసినందుకు సంతోషంగా ఉంది. ప్రజలుకు ఔషధాలు, విద్యుత్తు, నీరు, దిల్లీలో అభివృద్ధి పనులు ఆగిపోతే ప్రత్యర్థి పార్టీకి మరో అవకాశం వస్తుందని ఆందోళన చెందాను. ఏదేమైనాకానీ, నా అరెస్టు తర్వాత పార్టీ బలపడింది. వారు ఆప్‌ను విచ్ఛిన్నం చేయడంలో విఫలం అయ్యారు” అని కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు. ఆప్‌నకు చెందిన మరో నేత, మంత్రి ఆతిశీ మార్లీనా మాట్లాడుతూ “నేడు దిల్లీ సీఎం ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులంతా సంతోషించారు. ఆప్‌ను చీల్చాలన్న భాజపా యత్నం విఫలమైంది. ఓ బలమైన కుటుంబంగా పార్టీ నిలిచింది. ఈ నియంతృత్వంతో ఆప్ పోరాడుతుంది. కేజ్రీవాల్ విడుదల తర్వాత మనం దానిని ఓడిస్తాం” అని పేర్కొన్నారు.



## జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి హెూమంలో పాల్గొన్న భోగ శ్రావణి ప్రవీణ్



జగిత్యాల మే 12 (ప్రజా మంటలు) : జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాల్లో శ్రీపాద లక్ష్మీ నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన హెూమ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా.బోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మే 13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు




జగిత్యాల మే 12 (ప్రజా మంటలు) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈనెల 13న కార్మికులందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సురేంద్ర కుమార్ ప్రకటనలో తెలిపారు. ఏదైనా వ్యాపారం,వాణిజ్యం, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ రోజు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

## ఘనంగా ఆదిశంకరుని జయంతి - 27 కుండాలతో యజ్ఞం



జగిత్యాల మే 12 (ప్రజా మంటలు) : జిల్లా కేంద్రంలోని శుభ మస్తు హాల్ లో ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా శ్రీ విష్ణు సహస్రనామ, శ్రీ లలితా సహస్ర నామ, కనకధారా స్తోత్ర, మాహా యజ్ఞం ఘనంగా జరిగినది.శ్రీ మాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక మంగళా శాసనము లతో,బ్రహ్మశ్రీ తిగుళ్ల విషు శర్మ ప్రత్యక్ష పర్యవేక్షణలో, శ్రీ పాద లక్ష్మీ నరసింహ శాస్త్రి. బృందం మాహా యజ్ఞము నిర్వచించారు. 27 యజ్ఞ కుండాలు 108 జంటలు యజ్ఞము లో కూర్చున్నారు. తవుటు రామచంద్రం, శ్రీదేవి దంపతులు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేస్తుంటే పురోహితుల బృందం యజ్ఞ కార్య క్రమం జరిపారు.అనంతరం జరిగిన అన్నదానంలో 600మంది భక్తులు , మాతలు పాల్గొన్నారు.

## ఆకర్షనీయంగా మోడల్ పోలింగ్ కేంద్రం




కోరుట్ల రూరల్ మే 12 (ప్రజా మంటలు) : పార్లమెంట్ సాధారణ ఎన్నికల నేపథ్యములో జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామం లో మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకర్శించే విధంగా భారీ కటౌట్ స్వాగతం పలుకుతున్నట్లు ఏర్పాటు చేశారు.మహిళా ఓటర్లు అందరు ఓటు హక్కు వినియోగించు కోవాలని అధికారులు కోరారు.

## రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



జమ్మికుంట మే 12 (ప్రజా మంటలు) : టైల్స్ షాప్ వ్యాపారం చేసుకొంటున్న కొత్తపల్లి జమ్మికుంట నివాసి కల్లెపల్లి వెంకట రత్నం (45)జమ్మికుంట రైల్వేస్టేషన్ రెండవ ప్లాట్ ఫారం కి దగ్గరలో ఇంటికీ వెళ్ళడానికి రైలు పట్టాలు దాటే క్రమములో ప్రమాద వశాత్తుగా ఏదో రైలు బండి ఢీకొనగా చనిపోయినాడు. చనిపోయిన వ్యక్తికి భార్య ఇద్దరు పిల్లలు భార్య పేరు సుకన్య. ఇట్టి కేసు జి.తిరుపతి ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రామగుండం పరిశోధన చేస్తున్నారు.

## జిల్లాలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ సామాగ్రి ఓటింగ్ యంత్రాల పంపిణీ సర్వం సిద్ధం..



జగిత్యాల మే 12 (ప్రజా మంటలు) : జగిత్యాల మినీ స్టేడియంలో, ధర్మపురి నియోజకవర్గానికి ధర్మపురి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ,కోరుట్ల నియోజకవర్గానికి కోరుట్ల %బాఖీూ% హైస్కూల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటింగ్ యంత్రాలు సిబ్బందికి తల్లించేందుకు 295 వాహనాలు సిద్ధం చేశారు

అందులో సేక్టర్ అధికారులు 80 కార్లు పోలింగ్ సిబ్బంది తరలించేందుకు 85 బస్సులు 139మినీ బస్సులు 22 ఇతర వాహనాలు ఉన్నాయి. పోలింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలు తరలించేందుకు 7 కంటైనర్లు సిద్ధంగా ఉంచారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో 1104 మంది పోలింగ్ అధికారులు 1104 సహాయ పోలింగ్ అధికారులు 2208 మంది ఇతర సిబ్బంది 116 మంది మైక్రో అబ్జర్వర్లు పాల్గొంటున్నారు.నియోజకవర్గ వారీగా కోరుట్లలో 1261, జగిత్యాల లో 1227 ధర్మపురి లో 1014, చొప్పదండి నియోజకవర్గం లో మల్యాల, కొడిమ్యాల మండలంలో 517 మంది, వేములవాడ నియోజకవర్గంలో మేడిపల్లి, కథలాపూర్ మండలల్లో 431 మంది అధికారులు ఉద్యోగులు ఎన్నికల విధులు పాల్గొన్నారు. ధర్మపురి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు అదనపు కలెక్టర్ టిఎస్ దివాకర్., జగిత్యాల కేంద్రంలో ఆర్డిఓ పి. మధుసూదన్, కోరుట్ల కేంద్రంలో ఆర్డిఓ ఆనంద్ కుమార్ పరిశీలించారు.

## అటు ఓటు అవగాహన - ఇటు 252వ అన్నదాన కార్యక్రమము




సికింద్రాబాద్ మే 12 (ప్రజా మంటలు) : పార్లమెంట్ ఎలక్షన్స్ జరుగుతున్న సందర్భంగా పాదచారులు, వాహనదారులు, కండెక్టర్లు, డ్రైవర్లకు బట్టర్ మిల్క్ అందజేస్తూ అమూల్యమైన ఓటు గురించి అవహగాహన కలిపించి, నగరంలో ఫుట్పాత్ల మీద జీవనం సాగిస్తున అనాథలు, నిరాశ్రయులు, సంచారజాతుల వారికి 252వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్, ఓ.పావని, సభ్యులు కుషికోమాల్, మానస, అఖిల్, శుభం మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఆదిశంకరాచార్య, శ్రీ రామానుజ చార్య జయంతి వేడుకలు



జగిత్యాల మే 12 (ప్రజా మంటలు) : అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతములు ప్రతిపాదించిన మహనీయులు శ్రీ ఆదిశంకరాచార్య, శ్రీ రామానుజాచార్య జయంతి వేడుకలు సోమవారం సాయంత్రం 6 గంటలకు జగిత్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధి శ్రీరామ మందిరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైదిక క్రతువులను సభాపతి తిగుళ్ల సూర్యనారాయణ శర్మ, రుద్రంగి గోపాల కృష్ణ శర్మ, భట్టాజి గోపాల్ శర్మ, సంఘనపట్ల నరేంద్ర శర్మలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మంగళహారతి, మంత్రపుష్పం అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వితరణ తో పాటు ఆశీర్వచనము చేశారు.

## నేడే పార్లమెంట్ ఎన్నికలు - ఏర్పాట్లు సర్వం సిద్ధం..

**పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది...**

**ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి - ఎంపీడీవో వీరేశం**




భీమదేవరపల్లి మే12 (ప్రజామంటలు) : నేసు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు భీమదేవరపల్లి మండల అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో వీరేశం తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవడంతో వారికి కావల్సిన వసతుల సదుపాయాలను మండల అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని మొత్తం 46 పోలింగ్ కేంద్రాలు ఉండగా 4 గురు ప్రత్యేక అధికారులు, 184 మంది ఎన్నికల సిబ్బంది పాల్గొన్నట్లు ఎంపీడీవో వీరేశం తెలిపారు.

## లోకసభ ఎన్నికలకు పోలింగ్ సామగ్రి పంపిణీ

**-పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**



జగిత్యాల మే 12 (ప్రజా మంటలు) : జిల్లాలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ సామగ్రి, ఓటింగ్ యంత్రాల పంపిణీ ప్రక్రియ మొదలైంది.ఇందుకుగాను జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా నేతృత్వంలో సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం సోమవారం నాటి పోలింగ్ ప్రక్రియకు ముందురోజు ప్రక్రియను ఆదివారం ఉదయం 7 గంటలనుండే ప్రారంభించారు.

మధ్యాహ్నం నుండి పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్ళాయి. జగిత్యాల నియోజకవర్గానికి జగిత్యాల మినీ స్టేడియంలో, ధర్మపురి నియోజకవ ర్గానికి ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కోరుట్ల నియోజకవర్గానికి కోరుట్ల ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలుఏర్పాటు చేసారు. ఓటింగ్ యంత్రాలు, సిబ్బందిని తరలించేందుకు 295 వాహనాలు సిద్ధం చేశారు. అందులో సెక్టార్ అధికారులకు 80 కార్లు, పోలింగ్ సిబ్బంది తరలించేందుకు 85 బస్సులు, 139 మినీ బస్సులు, 22 ఇతర వాహనాలున్నాయి. పోలింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలు తరలించేందుకు 7 కంటేనర్లను సిద్ధంగా ఉంచారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో 1104 మంది పోలింగ్ అధికారులు, 1104 సహాయ పోలింగ్ అధికారులు, 2208 మంది ఇతర సిబ్బంది, 116 మంది మైక్రో అజ్జర్వర్లు పాల్గొంటున్నారు.. నియోజకవర్గాల వారీగా కోరుట్లలో 1261, జగిత్యాలలో 1227, ధర్మపురి 1014, చొప్పదండి పంపిణీ నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో 517 మంది, వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో 431 మంది అధికారులు, ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ధర్మపురి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, జగిత్యాల కేంద్రంలో ఆర్డీవో పి. మధుసూదన్, కోరుట్ల నియోజకవర్గంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్ లు పర్యవేక్షణ గావిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష జగిత్యాల పంపిణీ కేంద్రం వద్ద అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సిబ్బంది కలిసి తరలివెళ్లే వాహనాలను పర్యవేక్షణ చేశారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం ముల్కనూర్, వంగర ఎస్సైలు సాయిబాబు, వెంకటేశ్వర్లు

భీమదేవరపల్లి మే 12 (ప్రజామంటలు) : ముల్కనూర్, వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద 70 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు, ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఎన్నికలలో పాల్గొనడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు చేసినట్లు ముల్కనూర్, వంగర ఎస్సైలు సాయిబాబు, వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. సిపి ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగానేడే జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు 144 సెక్షన్ అమలు పరిచారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు, వంగర పోలీస్ స్టేషన్ల పరిధిలో 46 పోలింగ్ కేంద్రాల వద్ద 70 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## రాజ్యాంగాన్ని కాపాడాలన్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా కాంగ్రెస్ నే గెలిపించాలి

**గిరిజన బంజారా సంఘాల ఐక్యవేదిక - ప్రొఫెసర్ వీరన్న నాయక్**




భీమదేవరపల్లి మే 11 (ప్రజామంటలు) : గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం జరిగిందని, ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ప్రొఫెసర్ వీరన్న నాయక్ అన్నారు. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు లాంటి చర్యలు సమాజంలో అసమానతలను పెంచుతాయని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వీరన్న నాయక్ గిరిజన మేధావుల ఫోరం కన్వీనర్, చెప్యాల ప్రకాష్ తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బాదావత్ వీరస్వామి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సిద్ధమల్ల వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, సిద్ధమల్ల కృష్ణ మాజీ ఉపసర్పంచ్, గుగులోత్ లక్ష్మణ్ నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కొంగొండ సమ్మయ్య, సిద్ధమల్ల రాజమౌళి, ఎర్రోజు సుభాష్, కిషన్ నాయక్, కంకల సురేష్, యూసఫ్, వెంకటేష్, రవి, శ్రీను తదతరులు పాల్గొన్నారు.

## ముల్కనూర్ లో కాంగ్రెస్ కార్యకర్తల బైకు ర్యాలీ



భీమదేవరపల్లి (ప్రజామంటలు) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి రోజు మండలంలోని ముల్కనూరు గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ వెంకట నారాయణ, మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు, ఆధరి రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్రావును భారీ మెజార్టీతో గెలిపించాలనే నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎలక్షన్ కోడ్ ఐదు గంటలకు అమలు కావడంతో ర్యాలీ ముగించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పేద ప్రజలకు అండగా ఉన్న భారత రాజ్యాంగాన్ని లేకుండా చేయాలన్న బిజెపి పార్టీని, తెలంగాణ రాష్ట్రంలో లేకుండా తరిమేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీతో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షులు చీదురాల స్వరూప, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, యువజన కాంగ్రెస్ సహాయ కార్యదర్శి చిదురాల సురేష్, జక్కుల అనిల్, వల్లెపు శ్రీనివాస్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 14న మోదీ నామినేషన్.. - ఏర్పాట్లతో భాజపా



న్యూఢిల్లీ (ప్రజామంటలు) : ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు వారణాసిలో ఆయన నామినేషన్ వేసేందుకు పార్టీ శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది.అక్కడే దాదాపు రెండ్రోజులు ఉండి.. భారీ రోడ్షో సహా పలు ప్రచారకార్యక్రమాలు నిర్వహిస్తారు.ప్రధాని మోదీ వారణాసిలో 14వ తేదీన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే ఈ ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అమిత్షా, సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షిస్తున్నారు. ఆ పార్టీ సీనియర్ నేత సునీల్ బన్సల్ చాలా రోజుల నుంచి అక్కడే ఉండి పనులను చక్కబెడుతున్నారు. కాశీ విశ్వనాథుడు, కాలభైరవ ఆలయాలను కూడా ప్రధాని సందర్శించే అవకాశాలున్నాయి. బనారస్ హిందూ యూనివర్శిటీ నుంచి కాశీ విశ్వనాథుడి ఆలయం వరకు నిర్వహించనున్న ఐదు కిలోమీటర్ల రోడ్షో సుమారు నాలుగు గంటలపాటు జరగనుంది. అదే రోజు ఎన్డీఏ నేతల సమావేశంలో ఆయన పాల్గొననున్నట్లు తెలుస్తోంది.గతంలో నామినేషన్ దాఖలు చేసిన వివరాల ప్రకారం.. మోదీకి ప్రస్తుతం 73 ఏళ్లు. 2024 ఎన్నికల ప్రచారంలో నిత్యం వేల కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. సగటున మూడు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆదివారం పశ్చిమ బెంగాల్లో నాలుగు ర్యాలీల్లో పాల్గొని.. అనంతరం పట్నా వెళ్లి అక్కడ రోడ్షో నిర్వహించనున్నారు. ఇక సోమవారం పట్నాలోనే మూడు ర్యాలీలను పూర్తిచేసుకొని వారణాసి చేరుకుంటారు. అక్కడ మరికొన్ని ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. మే చివరి నాటికి మోదీ మొత్తం 180-190 రోడ్షోలు, ర్యాలీలు, సభల్లో పాల్గొన్నట్లవుతుంది.

## అణుబాంబులకు బెదిరేది లేదు

**- పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్దే**

**- ఆ ప్రాంతాన్ని వదిలేది లేదు**

**- యూపీ ఎన్నికల ప్రచారంలో అమిత్షా**



లఖ్నవూ(ప్రజామంటలు) : అణుబాంబులకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భయపడతారేమోగానీ.. భాజపా కాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్దేనని, దాన్ని తీసుకుంటామని స్పష్టం చేశారు. లోక్సభ ఎన్నికల నేపథ్యంలో ఉత్తర్ప్రదేశ్లోని ప్రతాప్గఢ్, రాయబరేలీల్లో నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయని, అందుకే ఆ దేశాన్ని గౌరవించాలంటూ హస్తం పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఇటీవల వైరల్గా మారిన విషయం తెలిసిందే."పాక్ వద్ద అణుబాంబులు ఉన్నాయని మణిశంకర్ అయ్యర్, ఫరూఖ్ అబ్దుల్లాలు చెబుతున్నారు. పీవోకేను అడగవద్దంటున్నారు. రాహుల్ గాంధీ.. మీరు అణుబాంబులకు భయపడాలనుకుంటే.. భయపడండి. కానీ, మేం అలా కాదు. పీవోకే భారత్కు చెందినదే. దాన్ని తిరిగి తీసుకుంటాం" అని అమిత్ షా పేర్కొన్నారు. రాయ్బరేలీలో గాంధీ కుటుంబానికి ఏళ్లపాటు అవకాశం ఇచ్చినా.. ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. స్థానికుల కష్టసుఖాలను ఆ కుటుంబం ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహించిన సోనియా గాంధీ తన ఎంపీ నిధుల్లో 70 శాతానికిపైగా మైనార్టీలకే ఖర్చు చేశారని ఆరోపించారు.కాంగ్రెస్ కంచుకోట, సోనియాను రెండు దశాబ్దాలుగా లోక్సభకు పంపుతూ వస్తున్న రాయ్బరేలీ నుంచి ఈసారి రాహుల్ గాంధీ పోటీ చేస్తోన్న విషయం తెలిసిందే. "ఇది గాంధీ కుటుంబ స్థానం అని చాలా మంది చెప్పారు. నిజమే.. ఇక్కడి ప్రజలు గాంధీ, నెహ్రూ కుటుంబాలను ఏళ్ల తరబడి గెలిపించారు. అయితే.. ఎన్నికైన తర్వాత సోనియా, ఆమె కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఇక్కడికి వచ్చారు?" అని అమిత్ షా ప్రశ్నించారు. ఆ కుటుంబం అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిందని విమర్శించారు.

## సోల నుండి శేరు దాకా

తమఇంటి అరుగుపై చేరిన పిల్లలకు మిఠాయిలు పంచిన బామ్మ ' బాలలు ఈరోజు మీకు మన పూర్వికులు ధాన్యాన్ని ఎలా కొలిచేవారో తెలియజేసే కథ చెపుతాను... మనదేశంలో 1957 లో మెట్రిక్ కొలతలు ప్రవేశ పెట్టారు. అంతకు మునుపు ' శేరు ' అంటే దాదాపు నేటి కిలోతో సమానంగా ఉండేది.దీనికి రెండు ' అచ్చేర్లు ' అచ్చేరుకు ' రెండు పావు శేర్లు ' పావు శేరుకి 'రెండు చిట్లు ' రెండు బళిగలు ' కలిస్తే చిట్టి, బళిగకన్నా చిన్నది ' ఇబ్బళిగ ' దీనికన్నా చిన్నది 'మబ్బళిగ 'అంతకన్నా చిన్నది ' పాలాడ ' ఇవి శేరుకి దిగువ కొలతలు.

శేరుకి ఎగువ కొలతలు... 'నాలుగు గిద్దలు సోల ' రెండు సోలలు ' శేరు ' మూడున్నర శేర్లు ' ముంత ' నాలుగు ముంతలు 'కుంచెం 'రెండు కుంచాలు 'ఇరస ' రెండు ఇరసలు ' తూము ' పది తూములైతే ' పందుము ' ఇరవై తూములైతే ' పుట్టి ' ఇలా ఉండేవి నాటి ధాన్యం కొలతలు. ఇహ కథలోనికి వెళదాం!



సిరిపురం జమిందారు గారి దివాణంలో కోశాధికారి పదవి కొరకు వచ్చిన వారందరిని పలు విధాలుగా పరిక్షించిచి రంగనాథం,శివయ్య అనే ఇరువురిని ఎంపిక చేసుకుని ఆఇరువురికి చెరో సోలడు శనగలు ఇచ్చిన జమిందారు 'నాయనలారా మీకు వారం రోజులు గడువు ఇస్తున్నా ఈశనగల ద్వారా మీలో ఎవరు ఎక్కువ ఆదాయం తీసుకువచ్చి నాకు చూపించండి ' అన్నాడు.

మరుదినం సాయంత్రం రంగనాథం మంచి వెలకు శనగలు అమ్మిడు. అదేరోజు శివయ్య తనకు జమిందారు ఇచ్చిన శనగలు తన తల్లిచేత గుగ్గిళ్లు చేయించుకుని బుట్టలో పెట్టుకుని ,బిందెలో నీళ్లు తీసుకుని అడవి లోనుండి నగరం లోనికి జనం వచ్చేదారిలో చెట్టుకింద గుగ్గిళ్ల బుట్టతొ కూర్చున్నాడు. అడవిలో కట్టెలు కొట్టేవారు,అదే మార్గన ప్రయాణించేవారికి గుగ్గిళ్లపై కారంపొడి, నిమ్మకాయ రసం వేసి అమ్మసాగాడు శివయ్య.దారిన వెళ్లేవారు గుగ్గిళ్లు తిని చిల్లరడబ్బులు ఇచ్చేవారు.సోలడు శనగలుతొ ప్రారంభమైన గుగుళ్ల వ్యాపారం వారం రోజుల్లో నాలుగు మానికలకు వరకు పెరిగింది.వారం రోజుల అనంతరం,జమిందారుని రంగనాథం,శివయ్యలు కలసారు.రంగనాథం కన్నా శివయ్య అధిక ధనం తీసుకురావడం గమనించిదు జమిందారు. శనగ గుగ్గిళ్ళ తో తను ధనం ఎలా సంపాదించాడో వివరించాడు శివయ్య. శివయ్య ఆలోచనా విధానం నచ్చిన జమిందారు శివయ్యను తన దివాణంలో కోశాధికారిగా నియమించాడు ' అన్నది బామ్మ.

బాలలు అందరు ఆనందంతో కేరింతలు కొడుతూ తమ ఇళ్ళకి పరుగులు తీసారు.

**గమనిక : నేటి తరం బాలలకు నాటి తరం కొలతలు తెలుపడమే ఈకథ ఉద్యేశం..**

**బెల్లంకొండ నాగేశ్వరరావు.**
**చెన్నయ్.**




### కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్ర
ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని
రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథల
పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు వడుత
గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచ
నల్ స్క్రీన్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువు
మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

### పచ్చని ప్రజాస్వామ్యం

వచ్చాయి వచ్చాయి ఎన్నికలు
తెచ్చాయి తెచ్చాయి కానుకలు
వస్తారు వస్తారు నాయకులు
ఇస్తారు ఇస్తారు హామీలు
వేస్తారు వేస్తారు ఓట్ల గాలాలు
చేస్తారు చేస్తారు పలు గారడీలు
విసురుతారు ఎన్నో ఆశల వలలు
విసురుతారు ఎన్నో తాయిలాలు
వలక బోస్తారు లేనిపోని ప్రేమలు
వల్లే వేస్తారు కల్లబొల్లి మాటలు
కుమ్మరిస్తారు ఓట్లకై ఎన్నో కోట్లు
పడతారు ఓట్లకై పాడరాని పాట్లు
జాగ్రత్త జాగ్రత్త ఓ ఓటరన్నా
దేశ ప్రగతికి నీ ఓటే కీలకమన్నా
పచ్చ నోటుకు నీ ఓటు అమ్ముకోకు
పచ్చని ప్రజాస్వామ్య తరువును నిలువునా
కూల్చబోకు!

గుండాల నరేంద్రబాబు
తిరుపతి,
9493235992

# ప్రజలారా ఓటేద్దాం రండి!

ఎన్నికలకు వేళయ్యింది. మనమంతా ఓటేసేందుకు కదలాలి. దీన్నొక యజ్ఞంగా ముందుకు తీసుకుని వెళ్లాలి. ఓటస్తామని బల్లగుద్ది మరీ చెప్పాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోఎన్నికలు జరుగబోతున్న వేళ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి. ఎపిలో అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో ఎంపి ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ప్రజలు ముందుగా ఓటేయడానికి ఇల్లు వదిలి పోలింగ్ బూత్‌కు కదలాలి. ఓటు తమ ప్రజాస్వామ్య హక్కుగా గుర్తించాలి. ఎవరికి ఓటేయాలన్నది వారి ఇష్టం. అయితే ఓటు వేయడం మాత్రం బాధ్యతగా భావించాలి. ఈ దేశంలో ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఒక్కరూ ఓటేయడానికి రావాలి. ప్రలోభాలకు లొంగకుండా ఓటు కోసం కదలాలి. ఓ మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా..తాము కోరుకున్న అభ్యర్థి గెలవాలన్నా ఓటేయాలి. ఓటేస్తే నాకేంటని ఆలోచించే మదందబుద్ది నుంచి బయటపడాలి. మన దేశంలో మన ఓటు ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడ తాయని గుర్తించాలి. గెలిచిన వారు పాలకులుగా మనమీద స్వారీ చేయకుండా..వారిలో భయం ఉండాలంటే ప్రజలు చైతన్యం కావాలి. ప్రజల చెంతకు వచ్చి సమస్యలు విని పరిష్కారం చూపే వ్యక్తులను, పార్టీలనే గెలిపించుకోవాలి.ప్రజల కోసం పనిచేసే వారిలా నటించే వారిని ఓ కంట కనిపెట్టాలి. అవినీతి అక్రమాలకు దూరంగా ఉండేవారిని గుర్తించాలి. మనోటు వృధా కాదన్న నమ్మకం తెచ్చుకున్న తరవాతనే ఓటేయాలి. ఎవరో చెప్పారనో లేక..మనకు ఎక్కడో దూరపు బంధువనో లేదా తెలిసిని వారికి చుట్టమనో ఓటు వేయరాదు. ఓటు చాలా పరమపవిత్రమైనది. మనం ఓటేయడంతో పాటు..మన తోటివారు కూడా ఓటేసేలా చూడాలి. అవసరమైతే ఓటేసేందుకు మనతోపాటు తీసుకుని వెళ్లాలి. ఇలా ఓటర్లు ఇల్లు కదలి బయటకు వచ్చేలా చేయగలగాలి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న, ఉపాధి పొందుతున్న వేలాదిమంది ఓటేసేందుకు సొంతూళ్లకు వెళ్లారు. నిజంగా ఇది ఓ మంచి పరిణామంగ చూడాలి. ప్రజలు ఇలా తమ ఓటు కోసం చొరవ తీసుకోవడం ముఖ్యం. ప్రజలకు భయపడి పాలన చేసేవారిని గుర్తించి ఓటేయాలి. గతఐదేళ్ల పాలనతో పాటు, స్థానిక ఎమ్మెల్యేల,ఎంపిల పనితీరు, గుణగణాలను ఆలోచించాలి. ఏ పార్టీ అభ్యర్థి అయితే మనకు అందుబాటులో ఉంటాడో ఆలోచన చేయాలి. నిజానికి ప్రజలు మార్పు కోరుకుంటున్నారా లేక..ఉన్న పాలననే అంగీకరిస్తున్నారా అన్నది ప్రజలు ఇచ్చే తీర్పుతో తేలిపోనుంది. ప్రజలు తాము ఆలోచించి ఎవరైతే మంచి పాలన ఇస్తారో అన్నది వివేచించి ఓటేయాలి. పాలన మన కళ్లముందే ఉంది. ఎపిలో వైకాపా పాలన ఎలావుందో..కేంద్రంలో బిజెపి పాలన ఎలావుంటో అన్నదే ఇక్కడ గీటురాయి. వారు రాష్ట్రంలో, కేంద్రంలో మంచి చేస్తున్నారా లేదా అన్నది చూడాలి. ఎపిలో గత ఐదేండ్లలో జరిగిన పరిణామాలను ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. పాలకులకు వ్యవసాయ విధానాల్లోనూ నిలకడ లేకపోవటం కూడా రైతన్నలను కలవరపరిచింది. పత్తి, పప్పు దినుసులు, చిరు ధాన్యాల సాగు విషయంలోనూ అస్పష్టత, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అలసత్వంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది రైతులు కళ్లాల వద్దే ప్రాణాలు విడిచారు. పంటల బీమా అమలు చేయాలని రైతాంగం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయం అందక రైతులు విలవిలలాడిపోయారు. ఇక కౌలు రైతులను గుర్తించటానికి కూడా ప్రభుత్వం ఇష్టపడలేదు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో కౌలుదారులే అధికసంఖ్యలో ఉండటం శోచనీయం. బదిలీలు, పదోన్నతులు, రెగ్యులరైజేషన్ జరగక, సకాలంలో జీతాలు రాక ఉద్యోగులు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఇవన్నీ ఎందుకు చెప్పాలంటే సమర్థ నాయకత్వం లేకపోవడం అన్నది గమనించాలి. తాము చేసిందే అభివృద్ధి, చేసిందే సరైనదన్న రీతిలో పాలకులు వ్యవహరించడం మూర్ఖత్వం. ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నాలు జరగడంలేదు. నాయకులు ప్రజలతో నేరుగా సంబంధాలు లేకుండా చేసుకున్నారు. కేవలం కార్పోరేట్, బిజనెస్ రంగాలతో మాత్రమే సంబంధాలు కొనసాగించారు. ఆంధ్రా ఆధిపత్య ప్రాంతాల నాయకులను ఉద్యమ సమయంలో తూలనాడిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆ నాయకులతోనే చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతూ వేలకోట్ల రూపాయల కాంట్రాక్ట్‌లను ఆంధ్ర కాంట్రాక్టర్లకే కట్టబెట్టడం గమనించాం. ఇవన్నీకూడా చర్చినీయాంశాలే. అందుకే ప్రజలు గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. ఎపిలో కూడా జగన్ పాలన ఎలా వుందన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎవరైతే మంచి పాలన ఇస్తారన్నది గమనించి ప్రజలు ఓటేయాలి. ఇక్కడా, అక్కడా పాలకుల తీరేఉ గీటురాయిగా ప్రజలు ఓటేసేందుకు కదలాలి. ప్రజలు తమ ఓటుతో పాలకలను అదీ ప్రజలకు అందుబాటులో ఉండేవారిని ఎన్నుకుంటే సమస్యలను తెలియచేసే అవకాశం వస్తుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు ముందుగా ఓటేయడానికి కదలాలి. హైదరాబాద్ నుంచి లక్షల్లో ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లడం శుభపరిణామం. ఓటేసేందుకు కదిలిన తీరు అభినందనీయం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరూ ఓటేసి చెప్పాలి. మేం ఓటేశామని చెప్పాలి. ప్రజలకు స్ఫూర్తిగా నిలవాలి. 90శాతం ఓటింగ్ జరగడానికి మనమంతా దోహదపడాలి.

# గాలివాన బీభత్సం



మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో గాలివాన, పిడుగులు పడిన వివరాలపై సీఎం ఆరా తీశారు.ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా అధికారులు, సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసిన సీఎం మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుతో గాయపడిన ఐదుగురికి వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలం గిమ్మ గ్రామ శివారులో పిడుగుపాటుకు అయిదుగురు వ్యక్తులు గాయాలపాలవ్వటం కలకలం సృష్టించింది. వీరిలో గిమ్మ గ్రామానికే చెందిన మామిడిపల్లి కిరణ్ అనే వ్యక్తి మృతి చెందటం స్థానికంగా విషాదం నింపింది. ఎంపీటీసీ సభ్యుడు కోల భోజన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్, ఉప సర్పంచ్ భర్త రమేష్‌లకు గాయాలవ్వగా, సంటెన్న అనే మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులందరినీ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బాధితులను పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గాలి, ఉరుముల మెరుపులతో భారీగా కురుస్తున్న వర్షంతో జిల్లా కేంద్రం అతలాకుతలం అయింది. జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో టెంట్లు పూర్తిగా కింద పడిపోయినాయి.దీంతో టెంట్ కింద ఉన్నటువంటి ఎన్నికల సిబ్బంది పాఠశాల గదులలోకి వెళ్లి తలదాచుకున్నారు. వర్షంలోనే వర్షంలోనే ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రిని తీసుకుని బస్సులలో బయలుదేరారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో ఉన్నటువంటి పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి చాలా కష్టమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

**సీఎం రేవంత్ సమీక్ష**తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సమీక్ష చేశారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మగ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఇదిలావుంటే ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన భీబత్సం సృష్టించింది. ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయింది. జైన్థ్ మండలం పిడుగుపాటుకు ఐదుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. కాగా, మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీ పల్లిలో పిడుగుపాటుకు తండ్రి,కొడుకు శ్రీరాములు(45), శివరాజు(15)మృతి చెందాడు. కాగా, రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పార్లమెంట్ నాలుగో విడుత ఎన్నికలు తెలంగాణ వ్యాప్తంగా జరుగనున్నాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి సైతం ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే



అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ వానలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది.

# వైభవంగా శంకర జయంతి వేడుకలు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



ధర్మపురిలో ఆది శంకర భగవత్పాదులు జయంతి ఉత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. శ్రీశారదామాత, శంకరాచార్య మందిరంలో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అనుబంధ దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల శ్రీ ఆదిశంకరాచార్యుల వారికి, శారదాదేవికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తరం పూజ, మన్యసూక్తం, దుర్గా సూక్తం , పంచోపనిషత్ లతో అభిషేకం, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ , బొజ్జ రమేష్ శర్మ , ముత్యాల శర్మ , స్థానిక వేదపండితులు మధు శంకర్ శర్మ , సంగనభట్ల దిలీప్ శర్మ , గుండి శ్రీనాథ్ శర్మ , సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ , అర్చకులు ద్యావల్ల విశ్వనాథ శర్మ , సాయికుమార్ అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం ఈఓ శ్రీనివాస్ దర్శకత్వంలో, దేవస్థానం సూప రింటెండెంట్ కిరణ్ పర్యవేక్షణలో సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**రామానుజాచార్య తిరు నక్షత్ర వేడుకలు**

రామానుజుల తిరు నక్షత్రం సందర్భంగా ప్రదాన దేవాలయంలో గల అభిషేకం మండపంలో రామానుజుల వారికి పంచసూక్తంలతో అభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో వైభవంగా నిర్వహించారు.

దేవస్థానం వేదపండితులు ముత్యాల శర్మ , ఉపప్రదాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య , అర్చకులు చక్రపాణి కిరణ్ కుమార్ , అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్ , రాజగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ధర్మపురిలో నగర సంకీర్తనం**

మసకబారి పోతున్న హైందవ ధర్మాన్ని పునరుజ్జీవింప చేసి, వేదాలలో, ఉపని షత్తులలో, భగవద్గీతలో ఉన్నవాటి ఉటంకించి, అద్వైత మతాన్ని స్థాపించిన ఆది శంకరుల జీవితం అందరికీ ఆదర్శ మని ప్రముఖ యాజ్ఞికులు, ఆధ్యాత్మిక ప్రాసంగికులు, వేద పండితులు కొరిడె చంద్ర శేఖర శర్మ ఉద్ఘాటించారు. ఆదివారం ధర్మపురి క్షేత్రంలో బ్రాహ్మణ నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో శంకర భగవత్పాదులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర శర్మ ప్రవచిస్తూ, భారతావనిలో నాలువైపులా తూర్పున జగన్నాథంలో గోవర్ధన మఠం, పడమట ద్వారకలో శారదామఠం, ఉత్తరాన కేదారంలో జ్యోతిర్మఠం, దక్షిణాన శృంగేరీలో శృంగగిరి మఠం నాలుగు మఠాలను స్థాపించారని వివరించారు.

ఈ సందర్భంగా శంకర జయంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు మధ్వాచారి రాం కిషన్, కార్యదర్శి డాక్టర్ పాలేపు దత్రాత్రి ఆధ్వర్యంలో.. కాసర్ల వంశీ కృష్ణ, మధు రామ శర్మ, విశ్రాంత ప్రాచార్యులు కొరిడే విశ్వనాథ శర్మ, పౌరాణికులు విశ్వనాథ్ శర్మ, తాడూరి బలరాం శర్మ, గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ, రవీందర్, కషో జ్జల రాజేశ్వర్ శర్మ, దినేశ్ శర్మ, పెండ్యాల శంకర శర్మ, కొరిడె చంద్ర శేఖర శర్మ, శంకర్, బొజ్జా దత్తాత్రి, కిష్టయ్య, ఆలువాల దత్తాత్రి, అంబరీష చారి, ఇందారపు లక్ష్మీకాంత శర్మ, శంకర్, కషోజ్జల సుధాకర్, శేఖర్, రొట్టె పార్థ సారథి శర్మ, పెద్దం భట్ల సుభాస్ చంద్ర, తాడూరి రఘునాథ్, సంగన భట్ల రామ కిష్టయ్య, వొజ్జల ప్రవీణ్ శాస్త్రి, కొరిడె శంకర్ శర్మ, డాక్టర్ ఇందారపు రామకృష్ణ, డాక్టర్ ఆకాశ్ శాస్త్రి, బొర్ర గుండయ్య, రాపాక నర్సయ్య,పెద్దంభట్ల నరేందర్ శర్మ, అలువాల కృష్ణ శర్మ, ఐ. రాంకిషన్, జనమంచి రాములు, నందగిరి ప్రభాకర్, పురాణపు సాంబ మూర్తి, బావి మురళి, నారసింహ మూర్తి, ఓజ్జల పురుషోత్తం, ఇందారపు రాములు తదితర విప్రవరులు పాల్గొన్నారు. ఇటీవలి ఎస్ ఎస్ సి పరీక్షా ఫలితాల్లో 10జీపీఏ సాధించిన సంగన భట్ల ప్రతీక్ష, బొజ్జా తరుణి, రావులపెల్లి రసజ్ఞ లకు ప్రశంసా పత్రాలు, నగదు పారితోషికాలు అందించి అభినందించారు.